నాడు దైన్యం.. నేడు ధైర్యం

- పల్లెల్లోనూ కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు
- ప్రారంభానికి సిద్ధంగా తాడిమళ్ల పీహెచ్‌సీ భవనం
- సమిశ్రగూడెం పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు
- మండలంలో 21,792 కుటుంబాలకు మెరుగైన వైద్యం


సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


కొత్తగా నిర్మించిన తాడిమళ్ల పీహెచ్‌సీ భవనం


సింగవరంలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం

నిడదవోలు రూరల్: నాడు.. అర్ధరాత్రి పేదోడి జబ్బు తిరగబెడితే పరుగులు పెట్టాల్సిందే. జేబులు ఖాళీ చేసుకోవాల్సిందే. అప్పు చేసి చికిత్స చేయించుకుందామన్నా నిడదవోలులో మెరుగైన ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ఉండేవి కావు. రాజమహేంద్రవరం.. తణుకు, లేదా ఏలూరు నగరానికో పరుగులు పెట్టాల్సిందే. అప్పట్లో గ్రామీణ పీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు అందేవి కావు. రోగమొస్తే ఎప్పుడు తెల్లారుద్దా అని ఎదురు చూడాలి. తీరా తెల్లవారాక వెళితే సమయానికి వైద్యులు ఉండేవారు కాదు. అదీగాక ఏ చిన్న ఆరోగ్య సమస్యతో వచ్చిన రోగినైనా పీహెచ్‌సీల వైద్యులు ఉన్నతాసుపత్రులకు రిఫరల్ చేసి చేతులు దులుపుకునేవారు. దీంతో పేదలకు సకాలంలో వైద్యం అందేది కాదు.

నేడు.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకున్నారు. పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించే చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలోని పరిస్థితులకు చెక్ పెడుతూ 'నాడు–నేడు' పథకంలో నాలుగేళ్లలో పీహెచ్‌సీల రూపురేఖలను సమూలంగా మార్చారు. మండలంలోని సమిశ్రగూడెం పీహెచ్‌సీని రూ.15 లక్షలతో అభివృద్ధి చేశారు. శిథిలావస్థకు చేరిన తాడిమళ్ల పీహెచ్‌సీ భవనం స్థానంలో రూ.1.50 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు. దీనిని త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మిస్తున్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలతో పాటు చికిత్స పొంది విశ్రాంతి తీసుకునే రోగికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తోంది.

పల్లెల్లో పూర్తి వైద్యసేవలు

నిడదవోలు మండలంలో 22 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 21,792 కుటుంబాలకు వైద్యసేవలు అందుతున్నాయి. ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో వైద్యం అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మిస్తున్నారు. మండలంలోని సింగవరం, కంసాలిపాలెం గ్రామాల్లో ఇప్పటికే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్క భవనానికి రూ.23.50 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనం ద్వారా వైద్యులు, సిబ్బంది గ్రామాలకు అవసరమైతే రోగుల ఇళ్ల వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు.

ఆదర్శంగా సమిశ్రగూడెం పీహెచ్‌సీ

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినందుకు సమిశ్రగూడెం పీహెచ్‌సీకి గతేడాది జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రోగులకు అందుతున్న సేవలు, రోజువారీ రోగుల సంఖ్య, ప్రసవాలు, ఆరోగ్య సిబ్బంది పనితీరు, ల్యాబ్ టెస్ట్‌లు, జాతీయ ఆరోగ్య సేవా కార్యక్రమాల అమలులో 86.20 శాతం మార్కులతో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్(ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికెట్ సాధించింది. ప్రతి బుధ, శనివారాల్లో వైఎస్సార్ క్లినిక్‌ల పరిధిలోని చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. రోజుకు 60 నుంచి 100 మంది అవుట్ పేషెంట్లకు సేవలు అందిస్తున్నారు. 24 గంటలూ అత్యవసర సేవలు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, తల్లీబిడ్డల సంరక్షణ, సాధారణ కాన్పులు, ప్రసవానంతరం వాహన సదుపాయం అందిస్తున్నారు.

మండలంలో నాలుగేళ్లుగా అందిన వైద్యసేవల వివరాలు

వైద్యసేవలు పొందుతున్న కుటుంబాలు	21,792
ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు పొందిన కుటుంబాలు	23,628
హెల్త్ క్లినిక్‌లు నిర్మాణానికి మంజూరైన నిధులు	రూ.4.93 కోట్లు
తాడిమళ్ల పీహెచ్‌సీకి మంజూరైన నిధులు	రూ.1.50 కోట్లు
సమిశ్రగూడెం పీహెచ్‌సీ అభివృద్ధికి మంజూరైన నిధులు	రూ.15 లక్షలు
శస్త్రచికిత్సలకు మంజూరైన నిధులు	రూ.640.60 కోట్లు
ఆరోగ్య ఆసరా కింద రోగులకు అందిన సాయం	రూ.10.54 కోట్లు

తాడిమళ్ల పీహెచ్‌సీలో అత్యాధునిక వసతులు

తాడిమళ్ల పీహెచ్‌సీ భవనాన్ని రూ.1.50 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులతో నిర్మించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా జనరల్ వార్డులు ఉన్నాయి ఆపరేషన్ థియేటర్, ప్రసూతి గది, ఇద్దరు వైద్యాధికారులకు ప్రత్యేక గదులు, స్టాఫ్ నర్సుల కోసం గదులు, మెడికల్ స్టోర్, ల్యాబ్, ఆసుపత్రికి వచ్చే రోగులకు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు.

పీహెచ్‌సీల అభివృద్ధికి చర్యలు



పీహెచ్‌సీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. సిబ్బందితో పాటు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల సహకారంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి.

– ఎ.అమరేంద్ర, పీహెచ్‌సీ వైద్యాధికారి, సమిశ్రగూడెం

ఆరోగ్యశ్రీ పేదలకు వరం



దివంగత సీఎం వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఎంతోమంది పేదలకు ఊపిరి పోసింది. గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. మళ్లీ ప్రస్తుత సీఎం వైఎస్ జగనన్న వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకానికి పెద్దపీట వేసి పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. 108, 104 వాహనాలతో పాటు ఇంటికే వైద్య సేవలు అందించడం పేదలకు వరంగా మారింది.

– ఎస్‌కే సుబేదర్, సమిశ్రగూడెం

ఆసుపత్రి నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ..



తాడిమళ్లతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందించేందుకు నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.1.50 కోట్ల వ్యయంతో పీహెచ్‌సీ నూతన భవనాన్ని నిర్మించారు. కోవిడ్ సమయంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటి వచ్చి ఎంతో ఓపిగ్గా వైద్యసేవలు అందించారు.

– రాపాక వెంకట్రావు, కోరుమామిడి

క్లుప్తంగా

విద్యార్థులకు పలకల అందజేత


విద్యార్థులకు పలకలు అందిస్తున్న సర్పంచ్ శివ తదితరులు

తాళ్లపూడి: దాతల సహకారంతో శనివారం బల్లిపాడులోని జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 50 మందికి పలకలు, ఇతర స్టేషనరీని సర్పంచ్ ఎల్లిన శివ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గెడ్డం విజయకుమార్ రాజు, ఉప సర్పంచ్ ఎం. దమయంతి, వైఎస్సార్ సీపీ నాయకులు గనిశెట్టి బంగారురాజు, ఉపాధ్యాయురాలు కె. రాజ్యలక్ష్మి, జి.వరలక్ష్మి, పేరెంట్స్ కమిటీ సభ్యులు వై.మోహిని, విజయదుర్గ పాల్గొన్నారు.

చీపురుగూడెంలో మలేరియా అవగాహన ర్యాలీ


దోమల వ్యాప్తిని అరికడదాం అంటూ చీపురుగూడెంలో అవగాహన ర్యాలీ

నల్లజర్ల: మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు శనివారం చీపురుగూడెంలో ఈ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నివారణ చర్యల్లో భాగంగా దోమతెరలు వాడకం, కిటికీలు, తలుపులకు జాలీల ఏర్పాటు, ఇంట, బయటా నీటి నిల్వలు లేకుండా చూడడం తప్పనిసరి అన్నారు. నీటి తొట్టెలను వారానికి ఒక సారి ఖాళీ చేసి తిరిగి నింపుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును ఆయన పరిశీలించారు. వైద్య ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

నల్లజర్ల: ప్రధానిగా నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఈనెల 20న రాజమహేంద్రవరంలో నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి శివ నాగరాజు శనివారం కోరారు. రాజమహేంద్రవరంలోని కోటిలింగాల రేవు వద్ద జరిగే బహిరంగ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, కేంద్ర మంత్రులు మురళీధరన్, జాతీయ ప్రధాన కార్యదర్శి పురంధరేశ్వరి హాజరవుతున్నట్టు చెప్పారు.

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలకు 52 మంది

కొవ్వూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 20 ఆయా పోస్టుల భర్తీకి శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. గోపాలపురం, పెరవలి, కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఈ ఖాళీలు ఉన్నాయి. కొవ్వూరు ప్రాజెక్ట్ పరిధిలోని ఏడు పోస్టులకు 19 మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ వారిలో 17 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. గోపాలపురం ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు పోస్టులకు 34 మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ, వారిలో 28 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇక పెరవలి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఆరు పోస్టులకు తొమ్మిది మంది దరఖాస్తు చేసుకోగా వారిలో ఏడుగురు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.ఐసీడీఎస్ జిల్లా అధికారి కె.విజయకుమారి, కొవ్వూరు ఆర్డీవో ఎస్. మల్లిబాబు, డాక్టర్ కె.మౌనిక, సీడీపీవోలు జి.మమ్మీ, వైబీటీ సుందరి, ఎం.శ్రీలక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

పట్టణానికి చేరిన మొక్కల కుండీలు


కొవ్వూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో క్రేన్ సాయంతో కుండీల అన్‌లోడింగ్

కొవ్వూరు: కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన కూడళ్లలో పెద్ద సైజు ఆర్నమెంటల్ మొక్కలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) నుంచి 60 పెద్ద సైజు కుండీలు రెండు లారీల్లో శనివారం ఇక్కడకు వచ్చాయి. క్రేన్ సాయంతో వాటిని మునిసిపాలిటీ ఆవరణలో దిగుమతి చేసి భద్రపరిచారు. కొవ్వూరు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, పార్కులు, మెయిన్ రోడ్డులో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లోను, రోడ్డు డివైడర్లలోను ఈ అందమైన కుండీలను ఏర్పాటు చేస్తారు. వాటిలో పూల మొక్కలు, బోగన్‌విల్లియా వంటి వివిధ రకాల మొక్కలను నాటుతామని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. పట్టణ సుందరీకరణలో భాగంగా వీటిని రుడా అందజేసిందని ఆయన తెలిపారు. ఒక్కో కుండీ బరువు సుమారు 250 కిలోల బరువు ఉంటుందన్నారు. తొలకరి వర్షాలు కురిశాక ఈ కుండీల్లో మొక్కలు వేసి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉంచుతారు.

అభివృద్ధి చేస్తున్నాం.. ఆశీర్వదించండి

- హోం మంత్రి తానేటి వనిత
- 16వ వార్డులో గడప గడపకూ..


ఔరంగాబాద్‌లో వృద్ధులకు అభివాదం చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 16వ వార్డు ఔరంగాబాద్‌లో శనివారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలను వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, స్థానిక నాయకులు బొల్లిపో వీర్రాజు, పాకా మోహనరావు, రాచర్ల ఇమ్మాన్యుయేలు, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, పట్టణ శాఖ పార్టీ గౌరవా ధ్యక్షుడు నగ్గల్లపాటి శ్రీనివాస్, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, వేంద్ర సూరిబాబు, పరిమి వెంకట్రావు, గంధం శేషసాయి, కొమ్మన మణిబాబు, కౌన్సిలర్లు పతివాడ నాగమణి, చీరా అరుణ, బత్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పశుబీమా పథకంతో పాడి రైతుకు ధీమా


వైఎస్సార్ పశుబీమా పథకంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సత్యగోవింద్

నల్లజర్ల: వైఎస్సార్ పశుబీమా పథకాన్ని పశు పోషకులందరూ సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి టీజే సత్యగోవింద్ అన్నారు. పశు బీమా పథకంపై శనివారం నల్లజర్ల, దేవరపల్లి మండలాల పశుసంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రలు, పశుసంవర్ధక శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. నల్లజర్లలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉత్పాదక దశలో ఉన్న ఒకసారి ఈనిన 2–10 సంవత్సరాల వయసు గల ఆవులు, 3–12 సంవత్సరాల వయసు గల గేదెలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఏడాదిన్నర వయసు పైబడిన మేలు జాతి సంకర జాతి ఆవులు, గేదెలకు కూడా వర్తిస్తుందన్నారు. రెండేళ్ల వయసు పైబడిన నాటు ఆవులు, గేదెలకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఆరు నెలలు ఆపై వయస్సు గల గొర్రెలు, మేకలు, పందులకు కూడా వర్తిస్తుందన్నారు. శాశ్వత వైకల్యం గల పశువులు, గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం వర్తించదన్నారు. కార్యక్రమంలో డీడీ రాధాకృష్ణ, బీమా సంస్థ ప్రతినిధులు సత్యకుమార్, పావని, నల్లజర్ల పశుసంవర్ధక శాఖ ఏడీ జాన్ మోజెస్ వెస్లీ, వివిధ గ్రామాల పశు పోషకులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు: గామన్ ఇండియా బ్రిడ్జిపై నుంచి ఈ నెల 15న గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన షేక్ నాగూర్ (25) మృతదేహం శనివారం పట్టణంలోని గోష్పాద క్షేత్రం వద్ద లభ్యమైంది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు. దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన నాగూర్ ఈ నెల 15న కుటుంబ సభ్యులతో కలసి కొంతమూరు గ్రామంలో బంధువుల ఇంట జరిగిన వివాహానికి హాజరయ్యాడు. మధ్యాహ్నం 12 గంటలకు భోజనం చేసిన అనంతరం ఇంటికి వెళ్లిపోదాం రావాలని భార్యను కోరాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో నాగూర్ తల్లి వెళ్లవద్దని సూచించింది.

ఎండగా ఉండడంతో పిల్లలు సైతం రావడానికి నిరాకరించారు. దీంతో కోపోద్రిక్తుడైన నాగూర్ ఒంటరిగా మోటార్ సైకిల్‌పై బయల్దేరి గామన్ బ్రిడ్జి 12వ నంబర్ స్తంభం వద్దకు చేరుకున్నాడు. బ్రిడ్జిపైకి ఎక్కి తల్లికి ఫోన్ చేశాడు. ఆమెకు వినికిడి లోపం ఉండడంతో నాగూర్ మాటలు సరిగా వినిపించలేదు. దాంతో మనస్థాపానికి లోనైన నాగూర్ నదిలో దూకినట్టు భార్య మోమిణీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

జగనన్న ఆణిముత్యాలకు పురస్కారాలు


వేలివెన్నులో విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య

ఉండ్రాజవరం: మండలంలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వేలివెన్ను, ఉండ్రాజవరం, తాడిపర్రు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులను ప్రజాప్రతినిధుల చేతులమీదుగా అందజేశారు. వేలివెన్నులో జి.జీవన జ్యోతి, పి.ప్రసన్న, డి.కోకిలలకు జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఉండ్రాజవరంలో ఎం.శిరిష, జి.ఉమా నరహరి, కే.సురేంద్రకుమార్‌లకు జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ మెండే వెంకట్రావు, విద్యాకమిటీ చైర్మన్ కరెళ్ల సోంబాబు, అందజేశారు. అలాగే తాడిపర్రులో సర్పంచ్ కె.నరేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఆండ్రోతు చిన్నారావులు మెరిట్ విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వి.విశ్వప్రసాద్, ఎం.వెంకటపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థికి సత్కారం

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద విద్యార్థికి బంగారు భవిష్యత్తు అందించేలా భరోసా కల్పిస్తోందని పెండ్యాల పంచాయతీ సర్పంచ్ కారింకి అన్నవరం అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పెండ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 527 మార్కులు సాధించి ఉన్నమాటి ఆకాష్‌బాబుకు శనివారం నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్ అందించి ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ సత్యరాజు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్‌లో 75 చెరువుల అభివృద్ధి

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈసీ మహేష్


మారెళ్లమూడిలో చెరువు పనులను పరిశీలిస్తున్న ఈసీ మహేష్ తదితరులు

నల్లజర్ల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఒక్కో చెరువుకు రూ.2 లక్షల చొప్పున వెచ్చిస్తూ జిల్లాలో 75 చెరువులను అభివృద్ధి చేస్తున్నట్టు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈసీ మహేష్ అన్నారు. మండలంలోని మారెళ్లమూడి గ్రామంలో జరుగుతున్న సోమాలమ్మ చెరువు అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో చెరువుల వద్ద చిన్నచిన్న మరమ్మతులు, అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. చెరువులోని పూడిక తీసిన మట్టిని గట్టుపై వేస్తే వర్షాలకు అది కరిగి మళ్లీ ఇదే చెరువులోకి వస్తుంది కదా? అటువంటపుడు మీరు చేసే పనుల వల్ల ఎంత వరకూ ప్రయోజనం చేకూరతాయని ఏపీఓను ప్రశ్నించారు. కనీసం ఒకట్నిర మీటర్ల దూరంలో వేసి చదును చేయాలని సూచించారు. నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల చుట్టూ మొక్కలు నాటి సిమెంటు బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఆగస్టు 15న ఇక్కడ జాతీయ జెండా ఆవిష్కరణ జరగాలన్నారు. అనంతరం చాదరాశిగుంట కొత్త చెరువు పనులను ఈసీ మహేష్ పరిశీలించారు. ఆయన వెంట ఉపాధి ఏపీఓ సత్యనారాయణ, టీఏలు శ్రీనివాస్, నాగరాజు,సందీప్ ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకన్న, ప్రసాద్, కృష్ణ ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా..

- ప్రభుత్వం పనిచేస్తోంది
- హోం మంత్రి తానేటి వనిత
- మార్కొండపాడులో వలంటీర్లకు వందనం


మార్కొండపాడులో వలంటీర్లకు పురస్కారాలను అందిస్తున్న మంత్రి తానేటి వనిత


చాగల్లు: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని మార్కొండపాడు గ్రామ సచివాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వలంటీర్లను పురస్కారాలతో మంత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థను తీసుకు వచ్చి పారదర్శకంగా ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. పెన్షన్, రేషన్ సరుకులు, సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా సకాలంలో లబ్ధిదారులకు చేరవేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా మంత్రి వలంటీర్లకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, రైతుల సంక్షేమం కోసం పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తోందన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, చేయూత, ఆసరా వంటి పథకాల ద్వారా అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని వనిత అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వలంటీర్లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బొబ్రా వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యులు ఎస్‌కే పాషా, పత్తిపాటి వెంకటేశ్వరరావు, పిల్లి తిరుమలరావు, సర్పంచ్ మద్దుకూరి రవి, పెదపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కొవ్వూరు: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇటీవల మహానాడులో పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలనని టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ పార్టీ శ్రేణులకు సూచించారు. టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయచౌదరి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీనివాస్‌నాయుడి జన్మదిన వేడుకలు


నిడదవోలులో పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు


వైఎస్సార్ సీపీ రంగులతో తయారు చేయించిన పూలదండ వేసి శుభాకాంక్షలు చెబుతున్న పెరవలి మండల నేతలు

నిడదవోలు: ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడి జన్మదిన వేడుకలను శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా అట్టహాసంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, వివిధ శాఖల అధికారులు, డ్వాక్రా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పట్టణంలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి వచ్చి శ్రీనివాస్ నాయుడికి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, సుమలత దంపతులు, కుమారుడు వరుణ్‌సాయిలు కోటసత్తెమ్మ వారి ఆలయానికి వెళ్లి విశేష పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి నాయకులు పార్టీ సింబల్‌తో కూడిన భారీ కేక్‌లను తెచ్చి ఎమ్మెల్యేతో కట్ చేయించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు జనాలు బారులు తీరారు. వచ్చిన వారందరికీ అల్పాహార, భోజన వసతి కల్పించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానిక లెప్రసీ కాలనీ వాసులకు భోజన వసతి కల్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ మంచినీటి పథకంతో పాటు న్యూ బోర్న్ స్టెబిలైజేషన్ యూనిట్, రక్త పరీక్షల ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పెరవలి: మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం నిడదవోలు వెళ్లి ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కానూరు గ్రామంలో పార్టీ నాయకుడు తోట సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

గోదావరి నదిలో దూకి వ్యక్తి గల్లంతు

కొవ్వూరు: రాజమహేంద్రవరంలోని రహమత్‌నగర్‌కు చెందిన ఎండీ శ్రీను అనే వ్యక్తి శనివారం రాత్రి రోడ్డు కం రైలు వంతెన 104వ స్తంభం వద్ద గోదావరి నదిలోకి దూకి గల్లంతయ్యాడు. శ్రీను పల్సర్ మోటార్ సైకిల్‌పై ఘటనా స్థలానికి వచ్చి నదిలో దూకుతున్నట్లు భార్యకు ఫోన్ చేసి చెప్పినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మోటారు సైకిల్ బ్రిడ్జిపై పార్కింగ్ చేసి, దానిపై సెల్‌ఫోన్ ఉంచి శ్రీను నదిలో దూకినట్టు చెబుతున్నారు. శ్రీను ఆర్‌ఎంపీగా ప్రాక్టీసు చేస్తున్నట్టు చెబుతున్నారు. చీకటిగా ఉండడంతో నదిలో శ్రీను ఆచూకీ లభ్యం కాలేదు. భార్య, కుటుంబ సభ్యులు, పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో రోడ్డు కం రైల్ వంతెనపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు.

వ్యాక్సినేషన్‌పై పర్యవేక్షణ

నల్లజర్ల: చిన్నారులకు జీవిత కాలం రక్షణగా నిలిచే వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా, సకాలంలో అందించాలని డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ ఎం ఫణి సూచించారు. మండలంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు తీరును శనివారం ఆయన పరిశీలించారు. జగన్నాథపురం, పుల్లలపాడు గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు వేస్తున్న రొటీన్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రస్తుత వేసవిలో వడగాడ్పులు వీస్తున్నందున చిన్నారులు వాటి బారిన పడకుండా ఉదయం వేళల్లోనే వ్యాక్సినేషన్ పూర్తిచేయాలని సూచించారు.

కాశియ్య కుటుంబానికి మంత్రి వనిత పరామర్శ

కొవ్వూరు: స్థానిక ఒకటో వార్డులోని శ్రీరామ కాలనీకి చెందిన చొక్కా కాశియ్య కుటుంబాన్ని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం సాయంత్రం పరామర్శించారు. అనారోగ్యంతో కాశియ్య (65) ఇటీవల మృతి చెందారు.మంత్రి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సాను భూతిని, సంతాపాన్ని తెలియజేశారు.వైఎస్సార్ సీపీ నాయకులు పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

చాగల్లు: మండలంలోని కలవలపల్లి విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల వార్షిక మరమ్మతుల కోసం ఆదివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ 33/11 కేవీ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్టు నిడదవోలు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు శనివారం తెలిపారు.

నేడు కలియాలమ్మ ఆలయంలో పూజలు

దేవరపల్లి: వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ దేవరపల్లి గ్రామదేవత కడియాలమ్మ వారి ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ కైరం అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి పూజలు చేస్తారు. అనంతరం పాల పొంగుల కార్యక్రమం జరుగుతుందన్నారు. వర్షాలు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నందున వర్షాలు కురిపించాలని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

19న విద్యార్థులకు మండల స్థాయి ఎంపిక పోటీలు

చాగల్లు: వైఎస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాల కోసం ఈ నెల 19న చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బి.రామ్‌ప్రసాద్ శనివారం తెలిపారు. పాల్గొనదలచిన బాల బాలికలు 4 లేదా 5వ తరగతి చదువుతుండాలని, ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 30 మీటర్లు, , 800 మీటర్ల పరుగు పందెం , లాంగ్ జంప్, ఎత్తు, బరువు పోటీలకు హాజరయ్యే విద్యార్థులు చాగల్లు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులను సంప్రదించాలన్నారు.

29న శ్రీవారికి లక్ష తులసి దళార్చన

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 29న లక్ష తులసిదళార్చన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు అర్చన జరుగుతుందన్నారు. అర్చనలో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.